ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
గురువారం 21 మార్చి 2024



రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:25 గురువారం
సహర్ 4:50 శుక్రవారం

మలి జాబితాలోనూ నిరాశే

గురువారం వెలువడుతుందని చెబుతున్న మలి జాబితాలో కూడా కరీంనగర్ అభ్యర్థిని ప్రకటించడం లేదని ఇప్పటికే వార్తలు వస్తున్నాయి. రాష్ట్రంలో ఉన్న 17 లోక్‌సభ స్థానాల్లో మూడు ఎస్సీ, రెండు ఎస్టీ స్థానాలు, హైదరాబాద్ స్థానాన్ని ముస్లిం మైనార్టీకి ఇచ్చే ఆనవాయితీ కొనసాగుతున్నది. జహీరాబాద్ స్థానానికి బీసీ వర్గానికి చెందిన సురేశ్‌షట్కర్ పేరును ఇప్పటికే ఖరారు చేయగా మెదక్ స్థానానికి నీలం ముదిరాజ్, సికింద్రాబాద్ స్థానానికి దానం నాగేందర్ పేరును ఖరారు చేశారని చెబుతున్నారు. దీంతో తొమ్మిది స్థానాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు కేటాయించినట్లు కాగా మరో ఎనిమిది స్థానాలు మిగిలి ఉన్నాయి. ఈ అన్ని స్థానాల్లో కూడా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారే ప్రధాన పోటీదారులుగా ఉన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఏ ఎన్నికలో అయినా రెడ్డి వర్గీయులకు ఐదు నుంచి ఆరు స్థానాలు మాత్రమే కేటాయిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం కూడా ఆరు స్థానాలను రెడ్లకు కేటాయించినా మరో రెండు స్థానాల్లో ఇతర కులాల వారికి కేటాయించాల్సి ఉంటుంది. ఆ రెండు స్థానాలు ఏవీ అన్న చర్చ రాగా కరీంనగర్, నిజామాబాద్ స్థానాల్లో ఇతర కులాలకు కేటాయిస్తారని ప్రచారం జరుగుతోంది.

రైల్వే అధికారులకు సహకరిస్తాం

● అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

కరీంనగర్ టౌన్, మార్చి 20: కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ పనుల విషయంలో రైల్వే అధికారులకు అన్ని విధాలుగా సహకరిస్తామని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైల్వే, ఇరిగేషన్, మైనింగ్‌శాఖల అధికారులతో రైల్వే లైన్ పనులపై అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ఉప్పర మల్యాల, గర్శకుర్తి గ్రామాల్లో కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్‌కు సంబంధించిన భూ సేకరణ దాదాపు పూర్తయిందని తెలిపారు. దానికి సంబంధించిన 58 కోట్ల రూపాయలు రైల్వేశాఖ డిపాజిట్ చేస్తే వెంటనే భూమి అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కొత్తపల్లిలో రైల్వే స్టేషన్ ఆధునీకరించే పనులు అధికారులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నా రని తెలిపారు. దానికి సంబంధించిన పనులకు మట్టి అందించే విష యమై ప్రత్యేక దృష్టి సారిస్తామని అదనపు కలెక్టర్ చెప్పారు. రైల్వే లైన్ పనులను వేగంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో రైల్వే శాఖ సీఈ ప్లానింగ్ అమిత్ అగర్వాల్, కరీంనగర్ ఆర్డీవో కె మహేశ్వర్, ఇరి గేషన్ శాఖ ఎస్ఈ శివకుమార్, మైనింగ్ ఏడీ రామాచారి పాల్గొన్నారు.

హోటళ్లు, లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు




హోటల్ లో రికార్డులను పరిశీలిస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, మార్చి 20: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా తీసుకునే ముం దస్తు చర్యల్లో భాగంగా కమీషనరేట్ వ్యాప్తంగా తనిఖీలు ము మ్మరం చేసామని సీపీ అభిషేక్ మొహంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి కరీంన గర్‌లోని అన్ని హోటళ్లు లాడ్జీల్లో ఆక స్మిక తనిఖీలు నిర్వహించామ న్నారు. డబ్బు, మద్యం, ఇతర వస్తు వుల పంపిణీ చేసేవారిని కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టామ న్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఈ తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఎన్నికల నియమావళిని పాటించాలని, ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు సహక రించాలని కోరారు.

కరీంనగర్‌పై వీడని చిక్కుముడి

కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికలో తర్జనభర్జన

అవకాశం దక్కేది ఎవరికో?



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థి ఎంపిక విషయంలో తర్జనభర్జన పడుతోంది. రెండో జాబితాలో కూడా కరీంనగర్ అభ్యర్థిని ఖరారు చేసే అవకాశం లేదని తెలుస్తోంది. మూడోసారి కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశమై చర్చించి ఈనెల చివరివారంలో ఒక నిర్ణయం తీసుకుంటుందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈస్థానం నుంచి రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల కమిటీ నుండి అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి పేరును మాత్రమే సెంట్రల్ కమిటీ పరిశీలనకు పంపించినా తొలి జాబితాలో ఆయన పేరును ప్రకటించలేదు.

● సామాజిక వర్గాల వారీగా అవకాశాలు

కరీంనగర్ లోక్‌సభ స్థానం నుంచి అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, వెలిచాల రాజేందర్‌రావు, రుద్ర సంతోష్‌కుమార్ టికెట్ ఆశిస్తున్నారు. వీరిలో ప్రవీణ్‌రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశీస్సులు ఉన్న కారణంగానే ఆయన ఒక్క పేరు మాత్రమే కేంద్ర కమిటీ పరిశీలనకు పంపించారు. ఆ పేరు రెండు జాబితాల్లో కూడా చోటు చేసుకోకపోవడంతో అందరిలో ఇక్కడ వేరేవారికే అవకాశం దక్కుతుందేమోనన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. రెడ్డి సామాజిక వర్గానికి ఈ సీటును కేటాయించక పోతే వెలమ సామాజిక వర్గం నుంచి టికెట్ అడుగుతున్న వెలిచాల రాజేందర్‌రావుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. ఇప్పటి వరకు జరిగిన రెండు లోక్‌సభ ఎన్నికల్లో మినహా ప్రతిసారి వెలమ అభ్యర్థికే టికెట్ ఇస్తూ వస్తున్న ఆనవాయితీ ఉన్నది. దీంతో ఈసారి మళ్లీ అదే ఆనవాయితీ కొనసాగే అవకాశముందేమో అన్న చర్చ జరుగుతున్నది. బీసీ సామాజిక వర్గానికి కనీసం ఐదు స్థానాలు ఇవ్వాలనే డిమాండ్ ఆ సామాజికవర్గం నుంచి బలంగా వస్తున్న నేపథ్యాన్ని ఆసరాగా తీసుకొని రుద్ర సంతోష్‌కుమార్ తనకు టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. సీడబ్ల్యూసీ స్థాయిలో తనకున్న పరిచయాలతో ఆయన టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రయత్నాల నేపథ్యంలో కరీంనగర్ లోక్‌సభ స్థానం రెడ్లకు దక్కుతుందా... వెలమలను వరిస్తుందా... బీసీ కల ఫలిస్తుందా అన్నది మూడో జాబితాలో మాత్రమే తేలనున్నదని సమాచారం.



పిచ్చుక గూళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

పిచ్చుకలను సంరక్షించాలి

● కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ కల్చరల్, మార్చి 20: కాలానుగుణంగా వాతావరణంలో వస్తున్న మార్పులతో పిచ్చుకలు అంతరించిపోతున్నాయని, వాటితో పాటు చిన్న చిన్న జంతువులను అందరూ సంరక్షించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజర య్యారు. విద్యార్థులు తమ ఇళ్లకు వచ్చే పిచ్చుకలను ఆదరించాలన్నారు. ఎండాకాలం నేపథ్యంలో గూడు తయారు చేసి నీళ్లు, ఆహారం అందుబాటులో ఉంచాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ మాట్లాడుతూ పిచ్చుకలను చిన్న పిల్లల్లాగా చూసుకో వాలని, తద్వారా అవి మనల్ని కాపాడుతా యని అన్నా రు. డీఎఫ్‌వో బాలా మణి, డీఈఓ జనార్దన రావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు పిచ్చుకలు ఎంతో దోహదపడుతాయని అన్నారు. అంతకు ముం దు వివిధ పాఠశాలల విద్యార్థులకు గూళ్ల ఏర్పాట్లు, ఆహా రం, నీరు అందించడం వంటి అంశాలపై చిత్ర లేఖన, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సైన్స్ అధి కారి చాడ జయపాల్‌రెడ్డి, సెక్టోరల్ అధికారి అశోక్‌రెడ్డి, ఎంఈవో మధుసూదనాచారి,న్యాయ నిర్ణే తలు గాజుల రవీందర్, సరిత, కేఏస్ అనంతాచార్య, లక్ష్మణ్, లశోక్‌రెడ్డి, జీవశాస్త్ర, ఫిజికల్ సైన్స్ ఫోరం ప్రతి నిధులు ఆంజ నేయులు,గంగారాం,శ్రీనివాస్, దామోదర్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు

● సీపీ అభిషేక్ మొహంతి



ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లో అధికారులకు సూచనలు చేస్తున్న సీపీ అభిషేక్ మొహంతి

తిమ్మాపూర్, మార్చి 20: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ అభిషేక్ మొహంతి హెచ్చరించారు. ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌ను ఆయన బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సదర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తీసుకో వాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. పోలీస్ అధికారులు, సిబ్బంది నిజాయితీగా, నిస్పక్షపతంగా, పారదర్శకంగా విధులు నిర్వర్తించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గల పోలీంగ్ కేంద్రాలను ప్రతి ఒక్కరు సందర్శించాలని, ఏమైనా లోటుపాట్లు ఉంటే వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లతోపాటు గతంలో ఎన్నికల సమయంలో జరిగిన గొడవలకు కారణమైన వారిని గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇప్పటికై బైండోవర్ అయి గడువు ముగిసిన వారిని తిరిగి బైండోవర్ చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోగల సమస్యాత్మక, సున్నితమైనా ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత పోస్టులు పెట్టేవారిని గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పని చేసి ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా కృషి చేయాలని సీపీ ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ స్వామి, ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు పాల్గొన్నారు.

కన్నుల పండువగా లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

తిమ్మాపూర్, మార్చి 20: మండలంలోని నల్లగొండలో లక్ష్మీనృసింహస్వామి కల్యాణాన్ని బుధవారం సాయంత్రం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. రాత్రి హోమం, స్వామి వారి గరుడ వాహన సేవ, బలిహరణ, తీర్థగోష్టి నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకార్యం కలగకుండా ఆయల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లక్ష్మణ్, ఈవో వెంకన్న పాల్గొన్నారు.




నల్లగొండలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

● వెల్దిలో చెన్నకేశవస్వామి కల్యాణం

మానకొండూర్: మండలంలోని వెల్ది లో చెన్నకే శవస్వామి కల్యాణాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చై ర్మన్ చల్లూరి విశ్వనాథాచారి, ఉపాధ్యక్షుడు తాల్లప ల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కోల రమేశ్, డైరెక్ట ర్లు పాల్గొన్నారు.



వెల్దిలో చెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



జిల్లా గ్రంథాలయంలో చదువుతున్న అభ్యర్థులు

ప్రణాళికాబద్ధంగా చదువుతూ..

● పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు
● కిటకిటలాడుతున్న జిల్లా గ్రంథాలయం, స్టడీ సర్కిల్స్

గణేశ్‌నగర్, మార్చి 20: జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం, స్టడీ సర్కిల్స్ అభ్యర్థులతో కిటకిటలాడుతున్నాయి. ఉదయం 10 గంటలకే గ్రంథాలయం అభ్యర్థులతో నిండిపోతోంది. వరుసగా నోటిఫికేషన్లు రావడంతో జిల్లాలోని నిరుద్యోగులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఉద్యోగాలు దక్కించుకు నేందుకు ప్రణాళికబద్ధంగా చదువుతున్నారు. బీసీ స్టడీ సర్కిల్, ఎస్సీ స్టడీ సర్కిల్స్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. ఎలాగైనా ఉద్యోగం సాధించాలని పట్టుదలతో ఉన్నారు.

ఉద్యోగం సాధిస్తా..

- దాడి శ్రీకాంత్, గోపాల్‌పూర్, కరీంనగర్.

పోటీ పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా చదువుతున్నా. శిక్షణ తీసుకుంటున్నా. ఈసారి ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం ఉంది.



పరీక్షలపై అవగాహన పెంచుకుంటున్నా..

- రాచమల్ల సాయిక్రిష్ణ, కరీంనగర్

బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్స్ కోసం శిక్షణ తీసుకుంటున్నా. ప్రతి రోజు టెస్టులు పెడుతున్నారు. పరీక్షలపై అవగాహన పెంచుకుంటున్నా. ఈసారి ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కష్టపడి చదువుతున్నా..



టైమ్ టేబుల్ రూపొందించుకున్నా..

ఎస్ శ్రీజ, కరీంనగర్

నేను గ్రూప్స్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా.. గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. టైమ్ టేబుల్ రూపొందించుకుని చదువుకుంటున్నా. గ్రంథాలయంలో స్టడీ రూమ్ అభ్యర్థులకు అనుకూలంగా ఉంది.



● వివిధ పరీక్షల తేదీలు:

గ్రూప్-1, గ్రూప్-2 గ్రూప్-3 పరీక్ష తేదీలను టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్-2, నవంబరు 17,18, తేదీల్లో గ్రూప్-3 పరీక్షలు నిర్వహించనుంది. గ్రూప్-1 ప్రిలిమ్స్ జూన్ 9న, మెయిన్స్ పరీక్షలు అక్టోబరు 21 నుంచి ఉంటాయి. గ్రూప్-1 లో 563, గ్రూప్-2లో 783, గ్రూప్-3లో 1388 పోస్టులు ఉన్నాయి. మరో వైపు డీఎస్సీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారుల పరీక్ష జూన్ 24, డీఏవో జూన్ 30, యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష జూన్ 16న ఉంది. బ్యాంకింగ్, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా ఏర్పాటు చేసిన పోటీ పరీక్షలకు నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. దీంతో అభ్యర్థులు ఉత్సాహంగా ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్నారు.



వేతనాలు చెల్లించకపోతే నిరవధిక సమ్మె

సుభాష్‌నగర్, మార్చి 20: నేషనల్ హెల్త్ మిషన్ పథకం కింద పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బందికి వేతనాలు, పీఆర్సీ అరియర్స్‌ను చెల్లించకపోతే నిరవధిక సమ్మెకు వెళతామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య హెచ్చరించారు. బుధవారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడు నెలల వేతనాలు, ఏడు నెలల పీఆర్సీ బకాయిలు చెల్లించాలని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నిధులు అందించకపోవడంతోనే వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఎన్‌హెచ్‌ఎం పథకంలో 78 కేడర్లలో 17,514 మంది పని చేస్తున్నారని తెలిపారు. వారంతా పేద, మధ్య తరగతి వారేనని అన్నారు. ప్రతినెల 1వ తేదీన జీతం అందితే తప్ప వారి కుంటుంబాలు నడవని పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 22నుంచి నిరవధిక సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. సమావేశంలో రెండో ఏఎన్ఎం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం రజిత, ప్రధాన కార్యదర్శి పి శోభ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి



రాజయ్య(ఫైల్)

ఓదెల,మార్చి 20: మండలంలోని కనగర్తిలో బుధవారం గుండారం రాజయ్య(62) అనే కౌలు రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. రాజయ్య కనగరిలోని ఆరెల్లి రాములు అనే మరో రైతు చెందిన 2.20 ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని వరి సాగు చేశాడు. బుధవారం నీరు పెట్టేందుకు వెళ్లి పరిశీలిస్తుండగా కింద ఉన్న విద్యుత్ లైన్ తీగలు కాలికి తగిలి అక్కడికక్కడే చెందాడు. రెండు రోజుల క్రితం గాలి, దుమారానికి విద్యుత్ తీగలు తెగిపడి ఉంటాయని, ఎవరూ తొలగించకపోవడం వల్ల రాజయ్య కాలికి తగిలి దుర్మరణం చెందాడని గ్రామస్థులు పేర్కొంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్సై అశోక్ రెడ్డి తెలిపారు.

పెద్దపల్లిలో యువకుడు...

పెద్దపల్లిటౌన్, మార్చి 20: విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. శాంతినగర్‌కు చెందిన ఒల్లెపు ఉపేందర్(23) ఓ పాత ఇల్లు కూల్చివేసే పనికి వెళ్లాడు. విద్యుత్ సర్వీస్ వైర్‌కు తగిలి ఉపేందర్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. తోటి కార్మికుడు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి మూడేళ్ల కూతురు ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రామడుగు, మార్చి 20: మండలంలోని వెంకట్రావ్‌పల్లిలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాకేశ్ అనే యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బోయినిపల్లి మండలంలోని అనంతపల్లి గ్రామానికి చెందిన అలువాల రాకేశ్ (21), రాగుల అరవింద్ అనే యువకులు మండలంలోని గోపాల్‌రావుపేటలో పుట్టిన రోజు వేడుకలకు హాజరైనట్లు తెలిపారు. పుట్టినరోజు వేడుకలను ముగించుకొని ఇద్దరు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా వెంకట్రావ్‌పల్లి గ్రామంలోని మూలమలుపు వద్ద మోటార్‌సైకిల్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొట్టినట్లు తెలిపారు. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా 108 వాహనం ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాకేశ్ మృతి చెందాడని తెలిపారు. మృతుని తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని విద్యార్థికి తీవ్రగాయాలు

మానకొండూర్, మార్చి 20: మానకొండూర్‌లో బుధవారం ఇసుక ట్రాక్టర్ ఢీకొని విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి..మానకొండూర్ గ్రామానికి చెందిన గొల్ల చరణ్‌తేజ్ అనే విద్యార్థి పోచంపల్లిలోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. స్నేహితుడి దగ్గరికి వెళ్లి తిరిగి వస్తుండగా అన్నారం వైపు నుంచి మానకొండూర్‌కు వస్తున్న ఇసుక ట్రాక్టర్ బాలుడిని ఢీకొట్టింది. ప్రమాదంలో చరణ్‌తేజ్‌కు తీవ్రగాయాలు కాగా 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

రెండు బస్సులు ఢీ : తప్పిన ప్రమాదం

గంగాధర, మార్చి 20: గంగాధరలో బుధవారం రెండు బస్సులు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో బస్సుల్లో ఉన్నవారు ఊపిరి పీల్చుకున్నారు. గంగాధర బస్‌స్టేషన్ నుంచి కరీంనగర్ డిపోకు చెందిన బస్సు బయటకు వస్తోంది. హుజూరాబాద్ డిపో బస్సు ప్రయాణికులతో బస్‌స్టాండుకు వెళ్తుండగా రెండు బస్సులు ఒకదానికొకటి బలంగా రాసుకున్నాయి. రెండు బస్సుల్లో ప్రయాణికులుండగా ఎవరికీ ప్రమాదం కాలేదు. విషయం తెలుసుకున్న కరీంనగర్ డీఎం, ఎస్‌ఐ కిరణ్‌రెడ్డిలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని బస్సులను పరిశీలించారు.

దొంగిలించిన బైక్ లభ్యం

రామడుగు, మార్చి 20 : మండలంలోని గోపాల్‌రావుపేటకు చెందిన రఘువీర్ అనే వ్యక్తికి చెందిన మోటార్‌సైకిల్ రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. కాగా బుధవారం పెగడపల్లి మండలంలోని నర్సింహునిపేటలోని క్రీడా ప్రాంగణం వద్ద బైక్ ఉందన్న సమాచారం మేరకు అక్కడికి వెళ్లి బైక్ తీసుకువచ్చినట్లు రఘువీర్ తెలిపారు.

ధర్మపురిలో బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభం



పుట్ట బంగారం కోసం స్వామి వారల సేవల ఊరేగింపు



యాజ్ఞికులు కందాలై పురుషోత్తమాచార్యులను ఆహ్వానిస్తున్న ఈవో, చైర్మన్

ధర్మపురి, మార్చి 20: ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం వేళలో మంగళవాయిద్యాలు వెంట రాగా ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, వేదపండితులు యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యుల ఇంటికి వెళ్లి ఉత్సవాలకు ఆహ్వానించారు. అనంతరం యాజ్ఞికులను ఆలయానికి తీసుకువచ్చారు. ఉత్సవాల కోసం ఆలయం పక్షాన ఈవో అర్చకులకు దీక్షావస్త్రాలు సమర్పించారు. అనంతరం లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు అంకురార్పణ, కలశ స్థాపన, ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవమూర్తులకు రక్షాబంధనం చేసిన అనంతరం నాందీముఖం, ఇదహవచనం చేసి మాతృకా పూజలు జరిపారు. స్వామి వారలకు డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, గోదావరి మహాహారతి రాష్ట్ర కో కన్వీనర్, బీజేపీ రాష్ట్ర నేత దామెర రాంసుధాకర్‌రావు పక్షాన అర్చకులు వేర్వేరుగా సొంతంగా స్వామి వారలకు పట్టు వస్త్రాలు సమర్పించారు.

● పుట్ట బంగారం కోసం స్వామి వారు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం వేళలో లక్ష్మీనృసింహస్వామి (యోగ, ఉగ్ర), వేంకటేశ్వర స్వామి వారల ఉత్సవమూర్తులను సేవలపై ఉంచి వరహాతీర్థం, పుట్ట బంగారం కోసం తీసుకెళ్లారు. సంప్రదాయ రీతిలో మంగళ వాయిద్యాలు వెంట రాగా స్వామి వారల ఊరేగింపు సేవలను చింతామణి చెరువు వద్ద నూతన వేదిక, టీటీడీ ధర్మశాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికల వద్దకు తీసుకెళ్లారు. పూజల అనంతరం అక్కడే మట్టిని తవ్వి ఆలయాలకు పుట్ట బంగారం తీసుకువచ్చారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు జరిపి స్వామివారలను దర్శనం చేసుకున్నారు. స్వామివారల సేవలను తిరిగి ఆలయాలకు తీసుకువచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఉత్సవాల్లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, జడ్పీటీసీ బత్తిని అరుణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ రాంనర్సింహరెడ్డి, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఉత్సవ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● మొదలైన భక్తుల రాక

ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవా కోసం భక్తుల రాక బుధవారం రాత్రి నుంచి మొదలైంది. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 21న గురువారం జరిగే లక్ష్మీనృసింహస్వామి (యోగ, ఉగ్ర),వేంకటేశ్వర స్వాముల కల్యాణోత్సవం తిలకించే భక్తులు నెత్తి మీద ముల్లెమూట పెట్టుకుని చేరుకున్నారు. నిజామాబాద్ జిల్లా నుంచి కాలినడకతో చేరుకున్న భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో తమ ఇష్టదైవమైన లక్ష్మీనర్సింహస్వామిని కొలుస్తూ దర్శించుకున్నారు.

● బ్రహ్మోత్సవాల్లో నేడు

ఈ నెల 21న గురువారం సాయంత్రం ఆరు గంటలకు గోధూళి సుముహూర్తమున శేషప్ప కళావేదిక పైన లక్ష్మీనృసింహస్వామి (యోగ, ఉగ్ర), వేంకటేశ్వర స్వాముల కల్యాణోత్సవం జరుగుతుందని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. శేషప్ప కళావేదికపై రాత్రి ఎస్‌వి శ్రీరాంభట్టార్ భాగవతార్‌చే హరికథ గానం ఉంటుందని ఆయన వివరించారు.

అక్రమంగా మద్యం, గుడుంబా రవాణాపై ఫిర్యాదుకు కంట్రోల్‌రూం

కరీంనగర్ క్రైం, మార్చి 20: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అక్రమంగా మద్యం, గుడుంబా, గంజాయి, కల్తీకల్లు దందాలపై సమాచారం లేదా ఫిర్యాదు చేసేందుకు కరీంనగర్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఎక్కడ అక్రమంగా మద్యం, గుడుంబా, కల్తీకల్లు, గంజాయి విక్రయాలు, వినియోగంపై సమాచారం ఉన్నా ప్రజలు నేరుగా కంట్రోల్ రూం నంబర్ : 8712658804కు సమాచారం అందించాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో అక్రమ మద్యం, ఇతర అక్రమ దందాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని ఏసీ తెలిపారు.

చెక్ పోస్ట్ వద్ద నగదు పట్టివేత

తంగళ్లపల్లి, మార్చి 20: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా సరిహద్దుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. బుధవారం తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల చెక్‌పోస్ట్ రూ.80 వేల 400 నగదును పోలీసులు పట్టుకున్నారు. పెద్దపెల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్‌కు చెందిన రాయికంటి వేణు వేములవాడకు కారులో వెళ్తుండగా జిల్లా సరిహద్దులోని చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలూ లేకపోవడంతో రూ. 80,400 స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్ట్ అధికారులు తెలిపారు.

మద్యం పట్టివేత

జమ్మికుంట రూరల్, మార్చి 20: జమ్మికుంట మండలంలోని అంకూసపూర్ గ్రామంలో గల బెల్ట్‌షాపులపై బుధవారం పోలీస్‌లు దాడులు నిర్వహించారు. ఓదెల శ్రీనివాస్ వద్ద రూ.1400 విలువ గల మద్యం బాటిళ్లు, శామంతుల సదానందం వద్ద రూ.2600 విలువ గల మద్యం బాటిళ్లను పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ద్విచక్రవాహనం దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

తంగళ్లపల్లి, మార్చి 19: ద్విచక్రవాహనం దొంగతనం చేసిన తంగళ్లపల్లి మండలం మండపల్లి గ్రామానికి చెందిన అల్లేపు నవీన్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలంలోని ఒగులాపూర్ గ్రామంలో సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా జాతరకు వచ్చిన సిరిసిల్ల పట్టణం ఇందిరానగర్ కాలనీకి చెందిన పెంట శ్రీనివాస్ తన ద్విచక్ర వాహనం పార్కు చేసి రాత్రిపూట నిద్రిస్తున్న సమయంలో చోరీకి గురైంది. దీనిపై ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్న క్రమంలో ఎస్‌ఐ వాహనాల తనిఖీ చేస్తుండగా దొంగిలించిన ద్విచక్ర వాహనం పట్టుబడింది. ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని చోరీకి పాల్పడిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

మల్యాల, మార్చి 20: ఒంటరితనం భరించలేక ఓయువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నూకపల్లికి చెందిన సైదులు వంశీ(23)కి రెండేళ్ల క్రితం వివాహం జరగగా మనస్పర్థలతో ఏడాది క్రితం విడాకులు అయ్యాయి. అప్పటి నుంచి వంశీ ఒంటరితనంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. బుధవారం ఉదయం వంశీ తండ్రి రాజయ్య గదిలోకి వెళ్లి చూడగా ఉరివేసుకొని మృతి చెంది ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఆర్ కృష్ణకుమార్ కేసు నమోదు చేశారు.

బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోగ గోవర్ధన్



బీడీ యజమానుల సంఘ నాయకులకు నోటీసులు అందిస్తున్న ఏఐటీయుసీ నాయకులు

కోరుట్ల, మార్చి 20 : బీడీ కార్మికుల సమస్యలపై యాజమాన్యం దృష్టి సారించాలని, బీడీ టేకేదారులకు కమీషన్ పెంచే విధంగా యాజమాన్య సంఘం చర్యలు చేపట్టాలని బీడీ వర్కర్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోగ గోవర్ధన్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా బీడీ వర్కర్స్ యూనియన్ సభ్యులకు బుధవారం నోటీసులను అందించారు. అనంతరం కోరుట్ల పట్టణంలోని సి ప్రభాకర్ భవనంలో ఏర్పాటు చేసిన బీడీ కార్మిక సంఘ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోగ గోవర్ధన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు మాట్లాడారు. నిజామాబాదు, కరీంనగర్, ఆదిలాబాదు, వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని బీడీ పరిశ్రమల్లో పనిచేస్తున్న ఏడు లక్షల మంది కార్మికులు చాటన్ ప్యాకింగ్ నెలవారీ ఉద్యోగులకు రెండు సంవత్సరాల వేతన ఒప్పంద కాలపరిమితి మార్చి 31తో ముగుస్తుందన్నారు. ప్రస్తుతం రోజురోజుకు ధరలు పెరిగిపోయినందున బీడిలకు మూల వేతనం రూ. 300 పెంచాలన్నారు. బీడి టేకేదారులకు కమీషన్ పెంచి వారి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీడీ పెడరేషన్ సంఘం నాయకులు భానుప్రసాద్, ఎండీ ముక్రం, శ్రీనివాస్, అదే రంగారెడ్డి, అనసూయ, కొక్కుల శాంత, శంకర్, మల్లారెడ్డి, రవి వెంకన్న, సాంబయ్య, నరసయ్య, భూమయ్య, రాజేశం, లక్ష్మణ్, పరందాం, రమేష్, లింగం, బాపురావు, శంకర్, శేఖర్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫలించిన మొగిలిపేట రైతుల భగీరథ ప్రయత్నం



గంగనాల ప్రాజెక్ట్ వద్ద బండరాళ్లను తొలగిస్తున్న రైతులు



మొగిలిపేటకు చేరుకున్న గంగనాల ప్రాజెక్టు నీరు

మల్లాపూర్, మార్చి, 20: మండలంలోని మొగిలిపేట గ్రామానికి గంగనాల ప్రాజెక్ట్ నీరు తీసుకరావడానికి రైతులు నలభై రోజులుగా భగీరథ ప్రయత్నం చేసి సాధించుకున్నారు. ఇబ్రహీంపట్నంలోని గంగనాల ప్రాజెక్ట్ నుంచి కాలువల ద్వారా వచ్చే నీరుతోనే గ్రామంలోని పంటల సాగు జరుగుతుంది. కానీ గత కొంత కాలం నుంచి గ్రామానికి తాగు, పంట సాగుకు ఇబ్బందులు ఏర్పడి పంటలు ఎండిపోయే స్థితికి వచ్చాయి. గంగనాల ప్రాజెక్ట్ నీరు వస్తేనే గ్రామంలో సమస్యలు తీరుతాయని రైతులు భావించారు. దీంతో ప్రాజెక్ట్ నుంచి గ్రామానికి నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో చేసేది లేక గ్రామంలోని రైతులు అంతా ఒక్కటై గంగనాల ప్రాజెక్ట్ నుంచి నీరు తీసుకరావడానికి పూనుకున్నారు. గంగనాల ప్రాజెక్ట్ వద్ద పూడిక పనులు చేయకుంటే నీరు సరఫరా కాదని భావించారు. రైతులందరూ కలిసి నలభై రోజులుగా భగీరథ దీక్షలాగా పనులు చేపట్టారు. ప్రాజెక్ట్‌లోని మట్టిని, రాళ్లను తొలగించడమే కాకుండా కాలువ వెంట పెరిగిన పిచ్చి మొక్కలు, పూడిత తీత పనులు చేశారు. వారి ప్రయత్నం ఫలించి కాలువ ద్వారా గ్రామంలోని చెరువులోకి నీరు చేరుకుంది. నీటి సమస్యలు రాక ముందే అధికారులు గంగనాల ప్రాజెక్ట్ కాలవ లైనింగ్ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రూ.7,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మార్చి 20: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,700 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 58మంది రైతులు 773 క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 12క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,700, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

బీఫార్మసీ పరీక్ష రుసుం గడువు

గణేశ్‌నగర్,మార్చ్ 20: ఎస్.యూ పరిధిలోని బి.ఫార్మసీ మూడు, ఐదవ సెమిస్టర్ (రెగ్యులర్‌సప్లిమెంటరీ), నాలుగు, ఆరో సెమిస్టర్ (సప్లిమెంటరీ) పరీక్ష రుసుం ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించడానికి 30వ తేదీ తుది గడువు అని 300/- ల అపరాధ రుసుం తో ఏప్రిల్ 3వ తేదీ లోపు చెల్లించాలని ఎస్ యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్ వి శ్రీ రంగ ప్రసాద్ తెలిపారు.పరీక్షలను ఏప్రిల్ నెలలో నిర్వహించనున్నారు.

మద్యం కట్టడికి తనిఖీలు ముమ్మరం

● ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

కరీంనగర్ క్రైం, మార్చి 20 : లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా అక్రమం మద్యం, గుడుంబా నిల్వ, సరఫరాలపై నిఘా పెట్టామని, అక్రమ మద్యంకు సంబంధించిన సమాచారాన్ని ఎక్సైజ్ శాఖ టోల్‌ఫ్రీ నెంబరు 1800-425-2523, కరీంనగర్ కంట్రోల్‌రూం 8019263862లకు సమాచారం అందించాలని కరీంనగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. గుడుంబా నియంత్రణ కోసం గ్రామీణ ప్రాంతాలలో తనిఖీలు ముమ్మరం చేశామని తెలిపారు. మద్యం, గంజాయి, గుడుంబా అక్రమ దందాలను అరికట్టేందుకు విస్తృత దాడులు జరుపుతున్నామన్నారు. అనుమానితులను బైండోవర్ చేసి, మళ్లీ నేరాలకు పాల్పడితే తహసీల్దార్ వద్ద జరిమానా విధించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ పోలీసు శాఖలో ఇంటిలిజన్స్ టీంలను కూడా ఏర్పాటు చేశామన్నారు. తరచుగా వాహనాల తనిఖీలు, పెట్రోలింగ్ కుడా నిర్వహిస్తున్నామన్నారు.

నిలిపి ఉంచిన వ్యాన్ చక్రాలు చోరీ

శంకరపట్నం, మార్చి 20: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలోని కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి పక్కన నిలిచిన ఓ వ్యాన్ ముందు చక్రాలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడు ఎరడపల్లి గ్రామానికి చెందిన భూతం సంపత్ జీవనోపాధి కోసం తాడికల్ గ్రామంలో పాత ఇనుప సామాను వ్యాపారం చేస్తున్నాడు. బుధవారం తెల్లవారు జామున చూసేసరికి సుమారు రూ. 50వేల విలువ చేసే తన డీసీఎం వ్యాన్ ముందు చక్రాలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

పెట్రోలులో నీళ్లు వచ్చాయని ఆందోళన

ఎల్లారెడ్డిపేట, మార్చి 20: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామ శివారులోని భారత్ పెట్రోలు బంక్‌లో పెట్రోల్‌లో నీళ్లు వచ్చాయని వాహనదారులు బుధవారం ఆందోళనకు దిగారు. బాధితుల కథనం మేరకు.. గుం డారంకు చెందిన ఇద్దరు తమ వాహనాల్లో పెట్రోలు అయిపోవడంతో బాటిళ్లలో తీసుకెళ్లేందుకు బంక్‌కు చేరుకున్నారు. బాటిళ్లలో పెట్రోలు పోయించుకుని వాహనం వద్దకు వెళ్లగా అడుగు భాగంలో నీళ్లలాగా కనిపించింది. దాంతో బంక్‌కు వెళ్లి నిర్వాహకులను ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆందోళనకు దిగారు. ఇదేమిటంటూ నిలదీశారు. కల్తీ పెట్రోలు వల్ల తమ వాహనాలు చెడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు బంకుల్లో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెళ్లి విందులో పరస్పర దాడి

● కేసు నమోదు చేసిన పోలీసులు

మెట్‌పల్లి రూరల్, మార్చి, 20: మండలంలోని ఆత్మకూర్ గ్రామంలోని పెళ్లి విందులో జరిగిన పరస్పర దాడిలో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. బుధవారం గ్రామానికి చెందిన అమ్మాయికి వేములవాడకు చెందిన అబ్బాయితో కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో ఘనంగా వివాహం జరిపించారు. అనంతరం జరిగిన విందులో అబ్బాయి తరుపున బంధువులకు భోజనం పెట్టడడం లేదని నిలదీశారు. దీంతో ఇరు వర్గాల మధ్య గొడవ జరిగి పలువురికి గాయలయ్యాయి. దీంతో అమ్మాయి తరుపు బంధువు దుద్దిళ్ల తిరుపతి అబ్బాయి తరుపు ఏడుగురిపై, అబ్బాయి తండ్రి నారాల రాజు అమ్మాయి తరుపు తొమ్మిది మందిపై ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వేంపేటలో మద్యం పట్టివేత

మెట్‌పల్లి మండలంలోని వేంపేట గ్రామానికి చెందిన పల్లి శేఖర్‌గౌడ్ బెల్ట్ షాప్ నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. 4లీటర్ల మద్యం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

కవిత్వమా.. వర్ధిల్లుమా..

-నేడు ప్రపంచ కవితా దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, మార్చి20: హృదయం స్పందించినప్పుడు కలిగిన భావోద్వేగానికి అక్షరరూపం కవిత్వం. సమాజ సమస్యలకు పరిష్కార మార్గాలకు కవిత్వం ఉపయోగపడుతుంది. 1999లో పారిస్‌లో జరిగిన యునెస్కో 30వ సదస్సులో మార్చి 21వ తేదీని ప్రపంచ కవితా దినోత్సవంగా పాటించాలని నిర్ణయించారు. రచన, పఠన, ప్రచురణ, బోధనా వ్యాసంగ చైతన్యం, జాతీయ, ప్రాంతీయ, అంతర్జాతీయ కవిత్వ ఉద్యమాల స్ఫూర్తిని పదిల పరచడం కవితా దినోత్సవ లక్ష్యాలు.

హృదయాలను రంజింపజేయాలి

-డాక్టర్ గంఢ్ర లక్ష్మణరావు, సాహితీవేత్త



హృదయాలను రంజింపజేసేదే కవిత్వం. సామాజిక చైతన్యానికి దోహద పడాలి. కవిత్వంలో భావుకత ముఖ్యం. ప్రజల పక్షాన నిలిచి కవిత్వం సృజన చేసినప్పుడే అది చిరకాలం జీవిస్తుంది.

హృదయ మాలిన్య ప్రక్షాళన

-నలిమెల భాస్కర్, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత



కవిత్వం హృదయ మాలిన్యాన్ని ప్రక్షాళన చేసే ప్రక్రియ. హృదయ భాష. ప్రకృతిని, సమాజాన్ని, జీవితాన్ని నిశితంగా పరిశీలిస్తూ చెప్పిన కవిత్వం కలకాలం నిలుస్తుంది. కవిత్వం కళాత్మకంగా ఉన్నప్పుడే పాఠకులను చేరుతుంది.

ఆటో డ్రైవర్‌ను కవిని చేసింది

-ఎండీ ఖాలిద్, రచయిత



ఆటో డ్రైవర్‌నైన నన్ను ఓ కవిగా నిలుపుతోంది కవిత్వమే. ఎన్నీల ముచ్చట్ల స్ఫూర్తితో ఈ రంగంలోకి అడుగిడినాను. చదవడం, కవి సమ్మేళనాలకు హాజరుకావడంతో నాలో కవిత్వంపై ప్రేమ పెరిగింది. పలు వేదికలపై నా కవితలను వినిపించడం ఆనందంగా ఉంది. నా కవిత్వ అంశాలు రైతులు, సైనికులు, పీడిత జనులు.

లూసియానా టెక్ యూనివర్సిటీతో 'జ్యోతిష్మతి' ఎంవోయూ

-ఎంఎస్ ప్రవేశాలకు ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజీకి వీలు

- జిల్లా విద్యార్థులకు అందుబాటులో అమెరికా ఎంఎస్ ప్రవేశాలు

కరీంనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో మొదటి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలగా నిలిచిన జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ సంస్థ (జిట్స్) అమెరికాలోని లూసియానా టెక్ విశ్వవిద్యాలయం (ఎల్‌టీయు)తో విద్యాభాగస్వామ్య అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. దీంతో లూసియానా టెక్ యూనివర్శిటీలో గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్, మాస్టర్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశం పొందేందుకు మార్గం సులువవుతుంది. విద్యార్థులకు స్కాలర్‌షిప్ పొందడానికి రెండు సంస్థల మధ్య ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజికి వృత్తిపరమైన వర్క్‌షాపులు, సెమినార్లు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడానికి వీలు కలుగుతుంది. లూసియానా టెక్ విశ్వవిద్యాలయాన్ని 1994లో స్థాపించారు. ఇంజనీరింగ్, సైన్స్‌లో పబ్లిక్ రీసెర్చ్ విశ్వవిద్యాలయంగా పేరున్న ఈ సంస్థ అందించే ప్రోగ్రామ్‌లు ఇంజనీరింగ్ టెక్నాలజీ అక్రిడేషన్ బోర్డుతో గుర్తింపు పొందాయి. జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాల స్వయం ప్రతిపత్తి గల సంస్థగానే కాకుండా నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడేషన్, న్యాక్ ఏ గ్రేడ్ పొందడంతో లూసియానా యూనివర్శిటీ ఈ ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు ముందుకు వచ్చింది. లూసియానా యూనివర్శిటీతో ఎంవోయు కుదుర్చుకోవడం పట్ల జిట్స్ చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఎంవోయూతో విద్యార్థులకు అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ లభించడంతో పాటు ఎంఎస్ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్లు పొందగలుగుతారని అన్నారు.

వేద్ ఆర్యన్‌రెడ్డికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ గోల్డ్‌మెడల్ ప్రదానం



సర్టిఫికెట్ అందుకున్న వేద్ ఆర్యన్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, మార్చి20: జిల్లా కేంద్రంలోని మంకమ్మతోటకు చెందిన ఆయిరెడ్డి వేద్ ఆర్యన్‌రెడ్డి తండ్రి క్రాంతి కుమార్‌రెడ్డి ఏడు నెలల వయసులోనే అబ్బురపరిచే ప్రతిభను చాటడంతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ గోల్డ్‌మెడల్‌తో పాటు ప్రశంసాపత్రాన్ని అందించింది. 2023 ఆగస్టు 3న జన్మించిన వేద్ ఆర్యన్‌రెడ్డి ఏడు నెలల వయసులోనే కూరగాయలు, పండ్లు, జంతువుల పేర్లను గుర్తుపట్టి చెప్పడంతో ఫ్లాష్ కార్డు ఐడెంటిఫికేషన్ ఎట్‌ది యంగెస్ట్ యేజ్ కింద తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ఇటీవల హైదరాబాద్‌లో ప్రదానం చేసింది. అతిచిన్న వయసులో బుడిబుడి మాటలతో మాట్లా డుతూ కూరగాయలు, పండ్లు, జంతువులను గుర్తించడం ఆశ్చర్యా నికి, ఆయన ప్రతిభకు గుర్తింపుగా అవార్డును ప్రదానం చేస్తున్నట్లు ప్రకటించింది. గోల్డ్‌మెడల్ సాధించడం పట్ల చిన్నారి తండ్రి క్రాంతి కుమార్‌రెడ్డి, తాతయ్య లక్ష్మారెడ్డితో పాటు తల్లి, అమ్మమ్మ, ఇతర కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఇల్లందకుంట ఆలయ హుండీ లెక్కింపు

ఇల్లందకుంట, మార్చి 20: ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయ హుండీ ఆదాయం రూ.4,04,434 సమకూరినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కందుల సుధాకర్ తెలిపారు. బుధవారం దేవాలయంలో దేవాదాయశాఖ పరిశీలకులు సత్యనారాయణ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు చేపట్టారు. 13హుండీలను లెక్కించగా రూ.4,04,434వచ్చినట్లు పేర్కొన్నారు.జూనియర్ అసిస్టెంట్ మోహన్, రాజయ్య, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్



హుజూరాబాద్‌లో శ్రీనివాస్‌కు కాంగ్రెస్ కండువా కప్పుతున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, మార్చి 20: జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థికి అత్యధిక మెజార్టీ ఇచ్చి సత్తా చాటాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. బుధవారం రాత్రి హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, వెంకట్రావ్‌పల్లి మాజీ సర్పంచ్ కె శ్రీనివాస్‌తో పాటు మొగిలి, సమ్మయ్య, చేరాలు, రాజు, సారయ్య, సదానందం, దేవేందర్, మోహన్, తదితరులు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ప్రణవ్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్లమెంట్ ఎన్నికల వరకు హుజూరాబాద్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఖాళీ కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పత్తి కృష్ణారెడ్డి, సొల్లు బాబు, కొల్లూరి కిరణ్, పొలంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడ్డ వ్యక్తిని ఆస్పత్రికి తరలించిన ప్రణవ్

హుజూరాబాద్, మార్చి 20: మండలంలోని తుమ్మనపల్లి గ్రామానికి చెందిన దక్షిణమూర్తి వ్యాపారం నిమిత్తం హుజూరాబాద్‌కు మోటర్ సైకిల్‌పై వెళ్తుండగా బుధవారం ప్రమాదశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ హుటాహుటిన కారులో నుంచి దిగి గాయపడిన దక్షిణమూర్తిని హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ప్రణవ్ సూచించారు.

యాదవుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ అండ

● మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

గంగాధర, మార్చి 20: యాదవుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ అండగా నిలిచిందని, రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం గంగాధర మండలం గోపాల్‌రావుపల్లిలో జరుగుతున్న బీరప్ప ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గొల్లకుర్మలు ఆర్థికంగా నిలదొక్కుకుని, ఆత్మ గౌరవంతో బతకాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాయితీపై గొర్రెలను అందించిందన్నారు.రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో గొల్లకుర్మలు ఆశీర్వదించాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, యాదవ మహాసభ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగారపు సత్యనారాయణ, వేములవాడ ఎంపీపీ మల్లేశం, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్య, నాయకులు నాగి శేఖర్, కిషన్, తిరుపతి, భాస్కర్ పాల్గొన్నారు.

గిరిజన వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

-తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమా సాహెబ్



రానూ నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గిరిజన నాయకులు

గణేశ్‌నగర్, మార్చి 20: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కామ్రేడ్ రానూ నాయక్ స్ఫూర్తితో ఉద్యమించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు భీమా సాహెబ్ పిలుపునిచ్చారు. రాను నాయక్ 74వ వర్థంతిని కరీంనగర్ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా భీమా సాహెబ్ మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం దేశానికే ఆదర్శమని అన్నారు. జనగామ ప్రాంతంలో ఆంధ్ర మహాసభ నాయకత్వంలో కమ్యూనిస్టులు రాకముందే ఆ ప్రాంతంలో దొరలు భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా లంబాడి గిరిజనులు పోరాడారని గుర్తు చేశారు.

కమ్యూనిస్టుల అండతో దొరల ఆగడాలపై వీరోచితంగా పోరాడటంలో రానూ నాయక్ ఆరుగురు అన్నదమ్ములు కీలక పాత్ర పోషించారన్నారు. మతాలు, కులాలు, ప్రాంతాలకు అతీతంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని నేడు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు వక్రీకరించి ఓట్ల రాజకీయానికి పాల్పడుతున్నాయని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ఆదివాసీ గిరిజన తెగల మనుగడ ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదిమ కాలం నుండి గిరిజన తెగలు కొనసాగిస్తూ వస్తున్న ఆహార అలవాట్లు, సంస్కృతి, ఆచారాలపై ఆధిపత్య మనువాద సంస్కృతిని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేసిందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గిరిజనులపై దాడులు, హత్యలు చేస్తూ భయభ్రాంతులకు గురిచేసినా వారిని కట్టడి చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రాజ్యాంగంలోని ఐదు, ఆరు షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనులకు ఉన్న హక్కులను కాలరాస్తూ గిరిజనేతరులకు భూమిపై హక్కులు కల్పించేందుకు గిరిజన చట్టాలను రద్దుచేసేందుకు సిద్ధపడిందన్నారు. 1/70, పెసా, అటవీ హక్కుల గుర్తింపు చట్టం2006ను సైతం కాలరాస్తూ అడవులు, అటవీ సంపాదను అంబానీ ఆదానీ లాంటి కార్పొరేట్లకు కట్టబెడుతూ అటవీ సంరక్షణ నియమాలు 2023 పేరుతో నూతన చట్టాన్ని చేయడం గిరిజనుల్లో తీవ్ర ఆందోళన, అభద్రతా భావానికి గురవుతున్నారని అన్నారు. బీజేపీ మూడోసారి అధికారంలో వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలకు ఎటువంటి హక్కులు లేని మనువాద రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసిందని అన్నారు. రిజర్వేషన్లు క్రమంగా నిర్వీర్యం చేస్తూ రద్దు చేయాలనే కుట్రలో భాగంగానే ప్రభుత్వ రంగం సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతోందన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు.

స్మార్ట్ సిటీ పనులపై విచారణ జరిపించాలి

కరీంనగర్ టౌన్, మార్చి 20: నగరంలో ఎస్ఆర్ఆర్ కాంట్రాక్టు ఏజెన్సీ చేసిన స్మార్ట్‌సిటీ అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని, పనులపై సమగ్ర విచారణ జరిపిన తర్వాతనే బిల్లులను చెల్లించాలని బీజేపీ కార్పొరేటర్ రాపర్తి విజయ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆమె కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయిని కలిసి వినతిపత్రం సమర్పించారు. తన డివిజన్ పరిధిలోని పెండింగ్ పనులు పూర్తయ్యేలా చూడాలని కోరారు.

గుండెపోటుతో ఏఎస్ఐ కిషన్ మృతి



కరీంనగర్ క్రైం, మార్చి 20: కరీంనగర్ రూరల్ పోలీసు ఠాణాలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మార్కొండ కిషన్ (59) బుధవారం సాయంత్రం కరీంనగర్ జ్యోతినగర్‌లోని తన నివాసంలో గుండె పోటుతో మృతిచెందారు. 1984 బ్యాచ్‌కు చెందిన ఏఎస్ఐ కిషన్ 40 సంవత్సరాలు సుదీర్ఘ కాలంపాటు పోలీస్ శాఖలో సేవలందించాడు. అతని ఉత్తమ సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే అతి ఉత్కృష్ట సేవా పథకాన్ని ప్రకటించగా, కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి చేతుల మీదుగా పథకాన్ని అందుకున్నారు. మృతుడికి భార్య , ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లిలో నిర్వహించనున్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు వివేకానంద విద్యార్థి ఎంపిక

కరీంనగర్, స్పోర్ట్స్ 20: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో ఈనెల 23 నుంచి 27 వరకు జరిగే 45వ జాతీయ స్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి గుర్రం తిరుమలేశ్ ఎంపికయ్యాడు. ఇటీవల వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన ఆయన జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. తిరుమలేశ్‌ను కళాశాల కరస్పాండెంట్ ఆగమ్‌రావు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అభినందించారు.

ఎస్ఆర్ఆర్ విద్యార్థుల క్షేత్ర పర్యటన

గణేశ్‌నగర్, మార్చి20: ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల, కరీంనగర్ లోని కామర్స్‌డిపార్ట్మెంట్ వైస్ ప్రిన్సిపాల్ టి రాజయ్య ఆధ్వర్యంలో కామర్స్‌డిపార్ట్మెంట్ విద్యార్థిని విద్యార్థులు ఫ్రేండ్లీ ట్రిప్ క్షేత్ర పర్యటనకై కరీంనగర్ లోని కరీంనగర్ మిల్క్ డైరీని సందర్శించారు. క్షేత్ర పర్యటనలో విద్యార్థినీ విద్యార్థులు రైతుల వద్ద నుండి తీసుకువచ్చిన పాలను ప్రాసెస్ చేయు విధానము, ఇతర పాల ఉత్పత్తులను తయారు చేయు విధానము వాటికి సంబంధించి విషయ పరిశీలన చేసుకున్నారు. ఈ పర్యటనలో అధ్యాపకులు డాక్టర్ ఏ నారాయణ, వి చంద్రమౌళి, ఎం శిరీష, నర్మద, రాములు, రాజు, గౌతమి ఇతర కామర్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకుంటానని ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి

- 2 గంటల్లో గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు



దేవయ్యను అతని కూతురుకు అప్పగిస్తున్న ఎస్ఐ రవి

కరీంనగర్ క్రైం, మార్చి 20: భార్యతో గొడవపడి ఆత్మహత్య చేసుకుంటానని ఇంటిలో నుంచి వెళ్ళిపోయిన కరీంనగర్ పాతబజార్‌కు చెందిన మందపల్లి దేవయ్య(55)ను కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు 2 గంటల వ్యవధిలో ఆచూకీ కనుగొని అతన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఒకటో ఠాణా సీఐ సరిలాల్ తెలిపిన వివరాల ప్రకారం దేవయ్య బుధవారం ఉదయం 10 గంటల సమయంలో తన భార్యతో గొడవపడ్డాడు. తాను ఆత్మహత్య చేసుకుంటానని కోపంతో ఇంటి నుంచి బయటకు వెళ్ళిపోయాడు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు దేవయ్య ఫోన్‌కు కాల్ చేయగా స్విచాఫ్ వచ్చింది. వెంటనే అతని కూతురు రమ ఒకటో ఠాణా పోలీసులను ఆశ్రయించింది. ఎస్ఐ రవి ఆధ్వర్యంలో ఒక పోలీసు టీం రంగంలోకి దిగి సాంకేతిక పరిజ్ఞానంతో 12 గంటల ప్రాంతంలో దేవయ్య కరీంనగర్ శివారులోని పద్మనగర్‌లో ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకుంది. అనంతరం అతన్ని ఠాణాకు తరలించి కౌన్సెలింగ్ నిర్వహించి క్షేమంగా కూతురుకు అప్పగించారు. దేవయ్య ఆచూకీ కనిపెట్టిన ఎస్ఐ రవిని, సిబ్బందిని ఈ సందర్భంగా సీఐ సరిలాల్ అభినందించారు.

ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, మార్చి 20: అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలకు చెందిన విద్యార్థులు క్వెస్ట్ సైన్స్, మాథ్స్ ఒలింపియాడ్‌లో జాతీయ స్థాయి అత్యుత్తమ బహుమతులు సాధించారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో నిర్వహించిన అభినందన సమావేశంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి విద్యార్థులను ప్రశంసాపత్రాలతో అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విధంగా శిక్షణ అందిస్తున్నా మన్నారు. జాతీయ స్థాయి గణిత ఒలింపి యాడ్‌లో ఆర్ శ్రీతన్, హవీష్‌రెడ్డి, శ్రీరాజ్‌రెడ్డి, శివేన్‌రెడ్డి, సిద్విక్, సహార్ష్, శ్లోకాపున్నమ్, శ్రీచరణ్‌రెడ్డి, వంశీకృష్ణ, స్వర విస్తృత్, సుమేధా మడమరాజు, పి శివాణి, జెహాన్సికరావు, తదితరులు ప్రతిభ చాటి బహుమతులు సాధించారు.

క్వెస్ట్ సైన్స్ ఒలింపియాడ్‌లో జి జోయల్, డెవిన్, శివాన్స్‌రెడ్డి, సహస్ర, సిద్విక్‌నార్ల, క్రిష్ణచైతన్య, ప్రన్మాయరెడ్డి, శ్రీహితచెట్టిరెడ్డి, శ్లోకపున్నం, అతిష్‌పటేల్, ఇనహెచ్ సహస్ర, విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్లు లేక ఇబ్బందులు

● పట్టించుకోని హుజూరాబాద్ మున్సిపల్ అధికారులు



ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

హుజూరాబాద్, మార్చి 20: హుజూరాబాద్ పట్టణంలో మూత్రశాలలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరంగల్-కరీంనగర్ రహదారి మధ్యలో ఉన్న హుజూరాబాద్‌కు నిత్యం వేలాది మంది వచ్చి వెళ్తుంటారు. అయితే మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో ప్రజలు ఆర్టీసీ బస్టాండ్‌లోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. హుజూరాబాద్ పట్టణ జనాభా సుమారు 50వేలకు పైగా ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో మున్సిపల్ అధికారులు రెండేళ్ల క్రితం కంటైనర్లతో కూడిన మరుగుదొడ్లను పట్టణంలోని సైదాపూర్ రోడ్, పాత కూరగాయల మార్కెట్, ఎంపీడీవో కార్యాలయం ఎదుట, హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేశారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. గురువారం వారసంత కావడంతో హుజూరాబాద్‌తో పాటు సైదాపూర్, ఎల్కతుర్తి మండలాల నుంచి వేలాది మంది వస్తుంటారు. మరుగుదొడ్లు పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో అతిపెద్ద డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లో కూడా మూత్రశాలలు లేకపోవడంతో వివిధ గ్రామాల నుంచి వస్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. డీసీఎంఎస్ అధికారుల వద్ద నుంచి దుకాణాలపై పన్నులు వసూళ్లు చేస్తున్న మున్సిపల్ అధికారులు మూత్రశాలలు ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా మాజీ మంత్రి ఈటల జన్మదిన వేడుకలు



ఈటలకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ శ్రేణులు



వల్భాపూర్‌లో ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలు

హుజూరాబాద్, మార్చి 20: హుజూరాబాద్ పట్టణంలో మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలు బుధవారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బాణాసంచా కాల్చారు. కార్యక్రమంలో గంగిశెట్టి రాజు, తూర్పాటి రాజు, సంజీవరెడ్డి, వాసు, రాజు, వెంకటేష్, రాజేష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● హుజూరాబాద్‌రూరల్: మాజీ మంత్రి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ జన్మదినం సందర్భంగా బుధవారం హైద్రాబాద్‌లో ఆయన నివాస గృహంలో చెల్పూర్, రంగాపూర్ గ్రామాల సర్పంచులు నేరేళ్ల మహేందర్‌గౌడ్, బింగి కరుణాకర్‌లు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులు, మండలంలోని రాజకీయ పరిస్థితులు మాజీ సర్పంచులు ఈటల దృష్టికి తీసుకెళ్లారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు కోసం పాటుపడుతామని తెలిపారు.

● ఇల్లందకుంట: మాజీ మంత్రి ఈటల రాజేందర్ జన్మదిన వేడుకల్లో ఇల్లందకుంట మండల బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు. బుధవారం శామీర్‌పేటలోని ఆయన నివాసంలో ఈటలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీరాంశ్యామ్, ఎర్రబెల్లి సంపత్‌రావు, సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, పవన్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, ప్రవీణ్, రమేష్, అమరేందర్, అజయ్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

● జమ్మికుంట రూరల్: జమ్మికుంట మండలంలోని బిజిగిరిషరీఫ్ దర్గాలో మాజీ మంత్రి ఈటల రాజేందర్ జన్మదినం సందర్భంగా మైనార్టీ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మైనార్టీ నాయకులు మహమ్మద్ నసిరుద్దీన్ మాట్లాడుతూ మల్కాజ్‌గిరి నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న ఈటల రాజేందర్ భారీ మెజార్టీతో గెలుపొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహమ్మద్ అహ్మద్, మహమ్మద్ యాకుబ్, మొహమ్మద్ హబీబ్, తదితరులు పాల్గొన్నారు.

● వీణవంక: మండలంలోని చల్లూరు, వల్భాపూర్ గ్రామల్లో మాజీ మంత్రి ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలు బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మాల్కాజిగిరి పార్లమెంటు నియోజికవర్గంలో ఎంపీగా గెలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమములో మారముళ్ల కొంరయ్య, ఎనగంటి శ్రీనివాస్,పెద్ది మాల్లారెడ్డి, దొమ్మటి రాజమల్లు, ఇట్టవు మహేష్, విజేందర్, గడ్డం కుమార స్వామి, జీడి రాజు, సమ్మయ్య, సతీష్, శ్రావణ్, సాయి, మహేందర్‌కుమార్ పాల్గొన్నారు.

ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, మార్చి 20: కరీంనగర్‌లోని కమాన్ ప్రాంతంలో నాళ్ల సాయికుమార్(36) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని వన్ టౌన్ పోలీసులు తెలిపారు. సాయికుమార్ మద్యానికి బానిసై గురువారం కమాన్ ప్రాంతంలో తాను నిర్వహిస్తున్న రేషన్‌షాపులో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

23న తాగునీటి సరఫరా బంద్

కరీంనగర్ టౌన్, మార్చి 20: నగరంలో ఈనెల 23న తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నామని, నీటిని పొదుపుగా వాడుకొని సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ బిశ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఎండీలో నీటి నిలువలు తగ్గిపోయి నందున ఆన్‌లైన్ బూస్టర్ పంపుసెట్ల వద్ద పైపులైన్ ఇంటర్ కనెక్షన్ పనులు జరుగుతున్నాయని, దీనితో ఒక రోజు తాగు నీరు సరఫరా ఉండదన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

భగత్‌నగర్, మార్చి20: జిల్లాలో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు కోరారు. కరీంనగర్ జిల్లాలో వడగళ్ల వానతో పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఎకరాన 25 వేల రూపాయల చొప్పున అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

బిల్డర్స్ అసోసియేషన్ కార్యవర్గం

కరీంనగర్‌రూరల్, మార్చి20: నగరంలోని రేకుర్తి 18వ డివిజన్‌లో నూతనంగా బిల్డర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్య క్షులుగా అస్తపురం నారాయణ, ప్రధాన కార్యదర్శిగా మ్యాక శ్రీనివాస్, కోశాధికారిగా దుర్గం ప్రభాకర్, నూతనంగా ఏర్పాటయిన కార్యవర్గాన్ని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో గొనైకిష్టయ్య, దుర్గం శివ, అస్తపురం (మీసాల) కొండగట్టు, నాగుల వెంకటేష్‌గౌడ్, అస్తపురం తిరుపతి, విక్రమ్, మాజీ ఎంపిటీసీ కుంబాల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

గీతామందిర సన్యాస మఠం వార్షికోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, మార్చి 20: నగరంలోని అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతామందిర సన్యాసమఠంలో బుధవారం వార్షికోత్సవాలు మఠాధిపతి విష్ణుసేవానందగిరిస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో కొనసాగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు జప, ధ్యానములు, అభిషేకాలు, సకల దేవతా హోమాలు, పూజలు, భజనలు, సంకీర్తనలు, భగవద్గీత, వివిధ దేవతల పారాయణాలు జరిగాయి.

ఘనంగా ఆమలక ఏకాదశి ఉత్సవం

కరీంనగర్ కల్చరల్, మార్చి20: స్థానిక తిరుమలనగర్, శ్రీనిల యంలో బుధవారం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఆమలక ఏకాదశి ఉత్సవాన్ని మయూరగిరి పీఠాధిపతి నమిలకొండ రమణాచార్యస్వామి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. శ్రీమన్నారాయణునికి ఫలరసపంచామృ తాభిషేకములు, పూజలు జరిగాయి. ప్రత్యేక హవనం నిర్వహించారు. సాయంత్రం వివిధ భజన బృందాల ఆధ్వర్యంలో 45 మార్లు హనుమాన్‌చాలీసా పారా యణం, భజనలు జరిగాయి. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

కీర్తి పురస్కారాలు అందుకున్న జిల్లా వాసులు

కరీంనగర్ కల్చరల్, మార్చి 20: జిల్లా కేంద్రానికి చెందిన నలుగురు తెలుగు యూనివర్సిటీ విశ్వవిద్యాలయ కీర్తి పురస్కారాలను బుధవారం హైదరాబాద్‌లో అందుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ మెట్రో రైల్వే సీఎండి ఎన్‌వీఎస్‌రెడ్డి, విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య తంగెడ కిషన్‌రావు, రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ చేతుల మీదుగా రచయిత, విమర్శకుడు దాస్యం సేనాధిపతి, కాలమిస్టు, పత్రికల వ్యాసాల రచయిత డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, రచయిత, పీవీ సాహిత్య పీఠం అధ్యక్షుడు కెవి సంతోష్‌బాబు, రచయిత, చరిత్ర పరిశోధకుడు డాక్టర్ చెన్నమాధవుని శ్రీనివాసరాజు 5 వేల రూపాయల చొప్పున నగదు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు.

కరపత్రం ఆవిష్కరణ

భగత్‌నగర్, మార్చి 20: భగత్‌సింగ్ వర్ధంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్‌కు భారతరత్న ప్రకటించాలన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

చొప్పదండి, మార్చి 20:చొప్పదండిలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. గౌడ కులస్తులు నిర్వహించిన ఎల్లమ్మ పట్నాలలో ఆయన పాల్గొన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, కాంగ్రెస్ నాయకులు కొమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి,ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, ముద్దం తిరుపతి, పురం రాజేశం, కర్ర సత్యప్రసన్నరెడ్డి, కొట్టె అశోక్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బియ్యం పంపిణీ

ఇల్లందకుంట, మార్చి 20: మండలంలోని కనగర్తి, ఇల్లందకుంట, రాచపల్లి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు 50కేజీల చొప్పున బియ్యం అందజేశారు.

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాపం

హుజూరాబాద్, మార్చి 20: హుజూరాబాద్ పట్టణానికి చెందిన రిటైర్డ్ ఏఈ వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందగా, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు బుధవారం సంతాపం వ్యక్తం చేశారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు.

గాయపడిన విద్యార్థులకు వైద్యం అందించాలి

జమ్మికుంట రూరల్, మార్చి 20: జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో వేడి నీళ్ల పడి గాయాలపాలైన ఇద్దరు విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని పిడిఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు అంగిడి కుమార్ అన్నారు. బుధవారం గురుకుల పాఠశాలను వసతులు ఉన్న భవణానికి మార్చాలని డిమాండ్ చేశారు.

ఫొటోగ్రాఫర్ రాంబాబుకు అవార్డు

జమ్మికుంట, మార్చి 20: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అటవీశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కులో కెమెరా ఐస్ పేరిట నిర్వహించిన కార్యక్రమంలో జమ్మికుంటకు చెందిన ఫొటోగ్రాఫర్ విజయగిరి రాంబాబుకు బుధవారం రాష్ట్ర స్థాయి ద్వితీయ బహుమతి దక్కింది. అటవి సంపద, వన్యప్రాణులు, పక్షులను తన కెమెరాలో అద్భుతంగా బంధించినందుకు అవార్డు అందించారు.

స్టాఫ్‌నర్సుకు ఘన సన్మానం

రామడుగు, మార్చి 20 : మండలంలోని గుండి గోపాల్ రావుపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్సుగా విధులు నిర్వహిస్తున్న సోని పదోన్నతిపై వెళ్లారు. మాజీ సర్పంచు కర్ర సత్యప్రసన్న బుధవారం పిహెచ్‌సీలో పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు.

వంటశాల నిర్మాణ దాతలకు సన్మానం

హుజూరాబాద్, మార్చి 20: హుజూరాబాద్ పట్టణంలోని సాయిబాబా ఆలయంలో వంటశాల స్థలం, నిర్మాణంకు విరాళాలు ఇచ్చిన దాతలను బుధవారం సన్మా నించిచారు. అనంతరం నాగార్జున డెయిరీ చైర్మన్ పుల్లూరి అహల్య-ప్రభాకర్‌రావు, మంతెన వరలక్ష్మి-సుదర్శన్‌లు మహా అన్నదాన కార్యక్రమం చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మెకానిక్ సదానందం తెలిపారు.